# మున్నా

## సవ్యసాచి

అవి నా ట్రైనింగ్ రోజులు. నా విద్యార్థి జీవితమంతా మా అత్తగారి ఇంట్లోనే గడిపాను. ప్రత్యేకమైన అనుభవాలు నా కా రోజుల్లో కలగలేదు. అసలు అనుభవమంటే యేమిటో నా ట్రైనింగ్ జీవితంలోనే తెలుసుకున్నాను నా రెండేళ్ళ శిక్షణా జీవితంలోను మొదటి సంవత్సరం హాస్టలులోనే గడచిపోయింది. అప్పుడు నాది యాంత్రిక జీవనం క్రమశిక్షణ బలవంతంగా అతికించుకునే కాలమది

మొదటి సంవత్సరంలోనే మంగపతితో స్నేహం కుదిరింది. మంగపతి పొట్టివాడు. ప్రతిరోజూ తీవ్ర వ్యాయామము చేసేవాడు కండలు తిరిగిన అతడి శరీరం చూడ్డానికి భయంకరంగా వుండేది. ముఖం అదో నమూనాగా వుండేది. నాకు పాటలంటే చాలా ప్రీతి. నేనూ కాస్తో కూస్తో పాడగలను; ఆ అభిరుచే మాకు స్నేహాన్ని కుదిర్చింది

మంగపతిది అదే టౌను. స్కూల్ ఫైనల్ ప్యాసై ఉద్యోగాన్వేషణలో సంవత్సరాలు దొర్లిస్తున్నాడు. మా హాస్టలు టౌనుకు చివరగా వున్నా, రోజూ నా దగ్గరకు వచ్చేవాడు. రోజూ పాడమని నన్నడిగేవాడు. పాడితే పాడేవాడిని లేకుండేది లేదు. ఆ యే దతడిని అర్థం చేసుకోవాలని నే నెక్కువగా ప్రయత్నించలేదు. కనుక అతడిని గురించి ఏ విధమైన అభిప్రాయమూ నాలో కలగలేదు

మాకు వేసవి సెలవు లిచ్చారు. నన్ను సాగనంపడానికి ఆ రోజంతా నాతోనే వున్నాడు మంగపతి. నిజంగా మంగపతికి దూరంగా పోవడానికి నాకూ బాధగానే వుంది.

'మంగపతీ! నేను వచ్చేలోగా ఒక గది చూసి వుంచవోయ్' అని చెప్పాను. అతడు మూగగా తలవూపాడు. బస్సులో కూర్చున్న నాకు 'టా టా' చెబుతూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అతడి దెంత కఠినశరీరమో అంత సున్నితహృదయమని నా కనిపించింది.

నలభై రోజుల వేసవి సెలవులు మంగపతి తలపులతో అతని లేఖలతో గడిపేసి టౌను చేరుకున్నాను బస్ దిగగానే మంగపతి కనపడ్డాడు.

'హలో గురూ!' అని కౌగలించుకున్నాడు

హలో అంటూ 'మంగపతీ! కులాసాయేనా?' అని అడిగాను

'నా కేమిటోయ్! మునుపటి కంటే ఒళ్ళు లావెక్కిందంటున్నారు పెద్దలు,' అన్నాడు నవ్వుతూ.

నా పెట్టే బేడా అంతా వాళ్ళింటికే చేర్పించాడు. ఆ రోజంతా మంగపతి ఇంట్లోనే గడిపాను పాపం మంగపతి తల్లి స్కూల్లో స్వీపరు. ఆమె తన స్వల్పవేతనంతో సాకుతూంది.

'మా అమ్మ ఈ వస్తాదుని మేపడానికి పడేశ్రమ అంతా ఇంతా కాదోయ్! ఏం చేసేది చెప్పు? ఎంత ప్రయత్నించినా ఉద్యోగమే దొరకదాయె!' అన్నాడు మంగపతి.

నాకు చాలా బాధ కలిగింది. వాళ్ళ గృహస్థితి నేను వర్ణించలేను కాని నా జీవితంలో అంత పేదవాళ్ళని యెప్పుడూ చూడలేదు ఆ నాడెలాగో గడిచిపోయింది. మరునాడు నే లేచే సరికి ఏడైంది. నా పెట్టే బేడాతోసహా మంగపతి కూడా కనిపించలేదు.

'బాబూ! అబ్బాయి నీకోసం యెక్కడో గది చూశాడు. దాంట్లో నీ సామాన్లన్నీ పెట్టడానికి పోయాడు నిన్ను స్నానం చేసి సిద్ధంగా వుండమన్నాడు,' అని వాళ్ళమ్మ చెప్పింది.

నేను గబగబ కాలకృత్యాలు ముగించుకుని, క్రాపు దువ్వుకుంటూ కూర్చున్నాను ఇంతలో మంగపతి వచ్చాడు అతడు తెచ్చిన సైకిల్ మీదనే బయలుదేరాం

అది సిక్ వాకీ మంగపతి సైకిల్ స్పీడుగా తొక్కుతున్నాడు 'మంగపతీ! ఇదేమిటోయ్? తిరిగి తిరిగి ఈ వీధిలో చూశావేమోయ్?' అని అడిగాను

'ఔను యేం?' అన్నాడు.

నేను సమాధానమివ్వలేదు. ఒక చిన్న ఇంటిముందు సైకిల్ దిగాం మెయిన్ గేటు దాటగానే మాగది. రూం మాత్రం నేలగాదు. కరెంటు వసతైతే లేదు గాని శుభ్రంగా నాకు సరిపోయేలాగుంది. గదిలోనే నా వెంకటేశ్వరస్వామి పటమ్ముందు అగరుబత్తులు దివ్యంగా వెల్గుతున్నయి

పగిలిన కొబ్బరిచక్కలు పున్నమి చంద్రుడిలాగా కనిపిస్తున్నయి. ఇదంతా మంగపతి పని అని నాకు తెలుసు.

"ఎలావుంది మన అరేంజిమెంటు," అన్నాడు మంగపతి.

"బ్రహ్మాండంగా ఉంది," అన్నాను

అంతలో ఇంటి యజమానురాలు వచ్చింది "నీవేనా బాబూ వుండేది, అని అడిగింది "ఔను," అన్నాను.

"బాబూ మేం పేదవాళ్ళం. అందుకే నీకిచ్చిన గదికీ, మా గదులకూ మధ్యన

దర్వాజ పెట్టించడానికి నిర్లక్ష్యమైంది అందుకే తడక కట్టాము. యేమీ అను కోకు," అన్నది.

నేనా విషయం గమనించలేదు. తడక వైపు చూశాను. నాకు నవ్వొచ్చింది "ఫరవాలేదండీ!" అని వూరుకున్నాను

"బాబూ! ఇంటి కిరాయకుమాత్రం ఆలస్యం చేయరాదు," అన్నది.

"సరే," నన్నాను.

ఒక్కక్షణం ఆగి మళ్ళీ మొదలు పెట్టింది "బాబూ! నువ్వు పాలకూ పెరుగుకూ యెక్కడకూ పోకు. మన ఇంట్లోనే దొరుకుతాయి. మా బ్రతుకంతా మా గేదెలపైనే ఆయన చేసే పోలీసు పనికి యేం జీతం వస్తుందో చెప్పు?" అని ముగించి వెళ్ళిపోయింది.

తన భర్త పోలీసని, వాళ్ళు పేద లనీ, పెరుగూ పాలవీ తన దగ్గరే కొన మనీ, ముఖ్యంగా అద్దె చక్కగా ఇచు కోవాలనీ చాలా సున్నితంగా చెప్పుకోవ డములోని ఆమె నేర్పు చూసి నాకు ఆశ్చర్యం వేసింది.

. "మంగపతీ! ఇంతకూ అద్దెం తన్నావ్?"—అని అడిగాను.

"పదిరూపాయలేనోయ్," అన్నాడు

నాకా ఇల్లు నచ్చింది. కాని ఒకచే బాధగా వుండేది. ఏమిటంటే మా ట్రైనింగ్ స్కూలు అక్కడికి చాలా దూరంలో వుంది. 8 గంటల స్కూలు కోసం 7 గంటలకే బయలుదేరాల్సి వచ్చేది మళ్ళీ ఐదుగంటలవరకుగాని ఇల్లు చేరేవాడినికాను. సాధారణంగా నేను వచ్చే వేళలో మంగపతి బుల్‌బుల్ సితార్‌పై పాటలు పాడుతూండేవాడు నాకు అలసట తోచేదికాదు. ఎంతటి విచారంలో ఉన్న మనిషినైనా నవ్వించ గలడు మంగపతి అది అతనిలో వున్న ఒక ప్రత్యేకత సాధారణంగా నా గది లోనే వుండేవాడు—నేనుండని వేళల్లో నా గదిలో ఉండేవాడో లేదోకాని, నే నుంటేమాత్రం నన్నొదిలి పోయేవాడు కాడు

అప్పటికి రెండు నెలలు గడిచాయి ఆ రెండు నెలల్లో మంగపతి నాకు సితారు నేర్పాడు. అప్పుడప్పుడు నేను సితారుపై పాటలు పాడుకొనేవాడిని. ఆ గది జీవితం అదొక ఆనందం కలిగించేది.

ఆనాడు ఆదివారం మంగపతీ నేనూ చదరంగం ఆటకు కూర్చున్నాము. ఆట పట్టుగా సాగుతూంది మంగపతి ఆటలో ఉద్రేకపడతాడు కనుక నే నాతనితో మనస్ఫూర్తిగా ఆడకపోయేవాడిని. దుర దృష్టవశాత్తు నేనే గెలిచాను. "ఛీ''— అంటూ కాయిన్సుని నేలకు కొట్టాడు.

అలాంటి పరిస్థితుల్లో నే నతడితో మాట్లాడకపోయేవాడిని. అతడే అనే వాడు "పెద్దప్లేయ రనుకోకోయ్. నిన్ను ఓడించేస్తానోలేదో చూడు!'' అని. కాని, అప్పుడు మాత్రం అలా అనలేదు. "మున్నా! కాసిని మంచినీళ్ళు పట్రా—"

అని కేకేశాడు. నే నాశ్చర్యంగా చూస్తూ వుండిపోయాను. ఎవరో అందమైన యువతి నీళ్ళగ్లాసుతో మా గది ద్వారం గుండా ప్రవేశించి గ్లాసు క్రింద పెట్టింది.

మంగపతి ఒకసారి ఆమెను క్రింది వరకూ చూసి, నీళ్ళు త్రాగేశాడు గ్లాసు పుచ్చుకొని మున్నా వెళ్ళిపోయింది.

"ఒరే! ఈ అమ్మాయి ఎవరు? ఈతనికి కెలా తెలుసు," అని నాకనిపించింది. ఆనాడు సాయంత్రం మంగపతి చెప్పాడు. "ఏమోయ్! మున్నాను చూశావుగా! ఎలా ఉందంటావ్?" అన్నాడు

"చాలా బాగుంది,"—అన్నాను

"ఏరిఏరి ఆరూను తీసుకోవడంలోని ఆంతర్య మేమిటో అర్థమైందా."

"ఐంది"

"నీవు నా స్నేహితుడివి కనుక చెబుతున్నా. మా మధ్యన కలలోకూడా అడ్డు రాకూడదు. కఠినంగా చెబుతున్నందుకు క్షమించు."

"అడ్డు వచ్చేంత అవివేకినా మంగపతీ." అన్నాను.

ఇక మంగపతి యేమీ మాట్లాడలేదు. అతడు మున్నాను ఎన్నాళ్ళుగా చూస్తున్నాడో, ఎన్నాళ్ళుగా ఆ కోరిక అతనిలో నిండివుందో యెవరికి తెలుసు! మున్నాకూడా మంగపతి అడగగానే నీళ్ళు తెచ్చిచ్చింది. అసలు సిక్కులు పరాయివాళ్ళకు కనిపించరు. ఐనా వీళ్ళ మధ్యన స్నేహం ఎలా కుదిరింది? నా కంతా అయోమయంగా తోచింది. మళ్ళీ నాకే అనిపించింది—'ఆ మాత్రానికే ఆమె మంగపతిని లవ్ చేసిందా?' — అని. వాళ్ళల్లోనూ చదువుకున్న సంస్కారాలున్నాయిగా అని అనుకొని సమాధాన పడ్డాను. ఒకవేళ నా ఈ ఆలోచనే సరైనదైతే మంగపతి మోసపోతాడు. ఐనా నాకెందుకని ఊరుకొన్నాను

ఆ నెలంతా గడిచిపోయింది ఒకటవ తారీకున నాకు స్టైఫండ్ దొరికింది ప్రతి వస్తుకీ మంగపతికి రెండు రూపాయలు డిస్కు రివ్వాలి. లేకుంటే అతడు మిత్రత్వపు హక్కులను వివరిస్తూ సమ్మె చేస్తాడు.

మంగపతీ నేనూ హోటలు కెళ్ళి తిరిగి వచ్చాం — మ్యాట్నీకి పోదామని పోరుపెట్టాడు నా వొంట్లో అట్టే బాగ లేనందున అతడినే పొమ్మని డబ్బిచ్చాను — వెళ్ళిపోయాడు. ఆ నాడంతా తలనొప్పితో బాధపడ్డాను. రాత్రి నిద్ర రాలేదు. తెల్లారేసరికి నా వొళ్ళు నాకు బరువుగా తోచింది. నన్ను నేను స్పర్శించుకొని చూస్తే శరీరం మండిపోతోంది. చాలా తీవ్రజ్వరం ఆవహించిందని అర్థమైంది ముఖం కడుక్కొని, కాఫీ తాగి వచ్చి పండుకొన్నాను. ఎంతసేపు నిద్రపోయానో నాకే తెలియదు. నేను లేచేసరికి చీకటి పడింది కడుపులో ఆకలి దహించి వేస్తోంది. అన్నం తింటే జ్వరం తీవ్రమౌతుందని భయం. గదిలో



దీపం వెలిగించుకొని బజారుకెళ్ళి పళ్ళు తిని వచ్చి పడుకొన్నాను. నాన్న గురించి. క్లాసుమేట్సుని గురించి ఆలోచిస్తూంటే కునుకు పట్టింది ఎప్పుడు లేస్తున్నానో, యేం తింటున్నానో, యెప్పుడు పడుకుంటున్నానో_ఏమీ ధ్యాస లేదు. రెండు రోజులు గడిచాయి నా జ్వరం తీవ్రమైంది. లేవలేనంత బలహీనంగా తయారయ్యాను

నాన్నను జ్ఞాపకం చేసుకొని భోరున యేడ్చాను. ఆయనకు ఉత్తరం వ్రాయడానిక్కూడా నాలో శక్తిలేదు. నా మీద నాకే అసహ్యం వేసింది. కంటికి నిద్ర రాలేదు. జ్వరం భరించరాకుండా వుంది. ఏడుకొండలస్వామికి ఏడుస్తూ మొక్కుకున్నాను.

దాదాపు అది 12 గంటలవేళ. నా గది తలుపు లెవరో తట్టారు

"తోయండి" — అన్నాను, తలుపు తోసుకొని మున్నాయే వచ్చింది. నాకాశ్చర్యం వేసింది. మెల్లిగా "ఏం కావాలండీ?"— అన్నాను

"మీకు వొళ్ళు బాగా లేదనుకొంటానూ?" — అన్నది.

"ఔను మూడు రోజులుగా నాకు నేనే భారంగా ఉంటున్నాను," అన్నాను.

"మీ స్నేహితుడు రావడంలేదా ?"

నే నామెవైపు చూశాను తలుపు కొరిగి నిల్చున్నది. తలపైన కొంగు వేసుకున్నది. ఆమె విశాల నేత్రాలలో నే నాశించిన భావం ఏదీ కనిపించలేదు.

"ఆయన రావడం లేదండీ," అన్నాను.

"మూడు రోజులుగా మీరు నిరాహార మేనా ?"

"ఔను."

"పాలో, పండ్లో తీసుకోలేక పోయారా ?"

"నేను లేవలేని స్థితిలో వున్నాను, ఎవరు తెస్తారు ?"

"పాలు మా ఇంట్లో దొరుకుతాయని మీకు తెలియదా ?"

నే నేమీ మాట్లాడలేదు. ఆమె వెళ్ళి పోయింది. నే నామె మంచితనం గూర్చి ఆలోచిస్తూ కళ్ళుమూసుకొన్నాను. పది నిముషాలు గడిచాయి.

"లేస్తారాండీ," అన్న మున్నా కంఠం వినిపించింది. కళ్ళు తెరిచాను నేను లేవలేను ఆ జ్వరం శతృవులకూడా రాకూడదు. నన్ను పూర్తిగా అశక్తుడిని చేసింది.

"ఎందుకూ ?" అన్నాను

"పాలు త్రాగాలి," అన్నది

"ఇవ్వండి "

"పండుకొని త్రాగలేరు, కూడదు కూడా. లేపండి "

నా కళ్ళల్లో నీళ్ళు నిండాయి. "లేవ లేనండీ!" అన్నాను.

"లేవలేరూ! జ్వరం అంత తీవ్రంగా ఉందా?" అంటూ ఆమె నన్ను స్పృశించి. ఒక్కసారి 'అబ్బా!' అని ఊరుకుంది

"ఏమైందండీ?" అన్నాను.

"ఏంలేదండీ — మీ జ్వరం ఎక్కువైంది. ముందునుంచే జాగ్రత్తపడితే బాగుండేది," అన్నది

"ఔను, నిజం!" అన్నాను

నా చేతులుపట్టి, వీపుపై చేయి ఆన్చి, లేపి కూర్చోబెట్టింది. ఏదో రెండు మాత్రలు మింగించింది. కాసిని మంచి నీళ్ళు గొంతులో పోసింది. వేడిపాలు త్రాగించింది. నేను దీర్ఘంగా ఆమెనే చూస్తున్నాను ఆమె అనన్యసంస్కారానికి నా హృదయం వంగి సలాములు చేసింది నిర్మలమైన ఆమె ముఖంలో సచ్ఛీలం మూర్తీభవించిఉంది. ఆమె ముఖంలో నిర్మలత ప్రశాంతత తప్ప నా కళ్ళు ఏమీ చూడలేకపోయాయి

"కాసే పిలాగే కూర్చొని, తరువాత పడుకోం"డని చెప్పి వెళ్ళిపోయింది.

నాకు దూరమైన అమ్మ జ్ఞాపకం వచ్చింది. రెండు కన్నీటిబిందువులు రాలిపడ్డాయి ఒకఐదునిముషాల తర్వాత పడుకొన్నాను

మరునా డెనిమిది గంటల వేళ న న్నెవరో లేపారు. కళ్ళు తెరచి చూస్తే మున్నాయే కనిపించింది "ఎలా వుంది

జ్వరం?'' అని అడిగింది

నాకు నేనొక హిమాలయంలా తోచింది నిన్నటిలాగా మాట్లాడానికికూడా శక్తి లేదు. మూగగా కుడిచేయి ఆమె కందించాను. ఆమె నా చెయ్యిచూసి అదిరి పడ్డట్టుంది నా జ్వరంగురించి ఏదో మాట్లాడుతుం దనుకొన్నాను నే ననుకొన్నట్లుగా జరగలేదు,

''ముఖం కడుక్కుంటారా ?'' అని అడిగింది మున్నా. నాకు నవ్వూ — బాధా రెండూ కలిగాయి.

"కడుక్కోవాలనే వుంది కాని..." అని ఆగాను.

మున్నా నన్ను లేపింది నాపై నిండుగా బ్లాంకెట్ కప్పింది. బ్రష్పై పేస్టుంచి బావిదగ్గరకు తీసికెళ్ళింది. నేను పళ్ళు తోముతూ కూర్చున్నాను. మున్నా వెళ్ళి వేడినీళ్ళు తీసుకొచ్చింది. ముఖం కడుక్కొని గది చేరుకున్నాను. ఒకసారి నా ముఖం అద్దంలో చూసుకున్నాను. అద్దం పగలగొట్టా లనిపించింది పెద్దగా పెరిగిన జుట్టు ముఖంమీద విచ్చలవిడిగా విహారము చేస్తోంది. కళ్ళు లోపలికి పోయి నాయి; ముఖమంతా ఈడ్చుకుపోయింది, మెల్లిగాజుట్టుదువ్వుకు పడకపై కొరిగాను

మున్నా మళ్ళీ పాలు తెస్తుందని నాకు తెలును. పాపం వాళ్ళు పేపలు నాకు పోసే అర్ధశేరు పాలున్నుకుంటే ఆరణాలౌస్తాయి. పేదరికంలో వున్న ఔదార్యం మున్నాలో ఎలా భాసిస్తుందో నా కర్థం అయింది ముఖ్యంగా మున్నా ప్రవర్తనే నాకు విచిత్రంగా తోచింది అసలీ ఆడదాని కింత ధైర్యం ఎలా కలిగిందా అని పించింది.ఇంతలో "పాలుతీసుకోండి"— అంటూ మున్నా రానే వచ్చింది నేను లేచి కూచున్నాను. పాలందుకున్నాను మున్నా వెళ్ళి తలుపు కొరిగి నిలబడింది. పలుచనైన మబ్బుచాటుకు జారుతున్న చంద్రబింబంలా ఆమె ముఖం ముసుగులో నిర్మలంగా ప్రకాశిస్తోంది. నేను పాలు త్రాగుతున్నాను — మున్నా అడిగింది. "ఏమండీ, ఇంత జబ్బుచేస్తే మీ అమ్మా నాన్నలకు జాబైనా వ్రాశారా"

''నా కమ్మ చిన్ననాడే దూరమైంది. నాన్న ఎప్పుడూ వూళ్ళో వుండడు —" అన్నాను.

"క్షమించండి, మీకు బాధ కలిగించా నేమో," అన్నది.

"లేదు" అని వూరుకున్నాను.

మున్నా సపర్యలతో 4,5 రోజులలో నా జ్వరం నయమైంది. ఆనాడు సోమ వార మనుకుంటాను. నేను స్నానం అదీ ముగించుకు బడికి పోతున్నాను మెయిన్ గేటులో ప్రవేశిస్తున్న మున్నా "ఎక్కడికండీ ?'' అని అడిగింది.

"స్కూలు కెళుతున్నాను—''అన్నాను

"వెళ్ళకండి," అని ఆదేశించినట్లుగా చెప్పింది

"కారణం ?'' అన్నాను.

"అవి తరువాత చెబుతా,"నని లోనికి వెళ్ళిపోయింది

తిరిగి గదిలో కొచ్చి కూలబడ్డాను. టైం ఏడు ముప్పయి అయింది. మున్నా తల్లి పనులన్నీ హడావుడిగా చేసేస్తూంది. ఇంట్లో గిన్నెలచప్పుడు విపరీతంగా వినిపిస్తోంది. నాకు ఏమీ తోచలేదు. చిందర వందరగా పడివున్న పుస్తకాలన్నీ చక్కగా పెడుతూ కూర్చున్నా. ఇంతలో మున్నా తల్లి వచ్చింది.

"నమస్తే బాబూ! మీతో ఒక అవసరం ఉంది. మనం ఒకగేదెని కొన్నాం. ఒక ఇరవై రూపాయలు తక్కువై వున్నాయి. నీ దగ్గర డబ్బుంటే తప్పకుండా ఇస్తావని వచ్చాను," అన్నది. నా స్టయిఫండ్ డబ్బు – ఇంటి డబ్బు కలిసి నా దగ్గర యేభైరూపాయ లున్నాయి, కనుక లేవనలేకపోయాను.

ఇరవై రూపాయలు తీసుకొని సంతోషంగా వెళ్ళిపోయింది. మంగపతిని కలవాలని మనసు తొందర పెట్టింది. మున్నా నన్ను ఉండమని ఆదేశించింది. ఇంకొకగంట గడిస్తేనే గాని మున్నా తల్లి వెళ్ళిపోదు. అప్పుడుగాని మున్నా రాదు. మంగపతి ఇల్లు నా గదికి అట్టే దూరంలేదు. పది నిముషాల్లో వాళ్ళిల్లు చేరుకున్నాను. ఆయనతల్లి ఇంటిముందు ఊడుస్తోంది

"అమ్మా! మంగపతి వున్నాడా? వారం రోజులుగా కనిపించడం లేదేం?" అని అడిగాను.

"ఉన్నాడుబాబూ," అన్నది. ఆమె మాటల్లో నా కేదో అసాధారణత కనిపించింది. నేను లోనికి దారితీశాను.

"ఇప్పు డింట్లో లేదు బాబూ, చాలా సేపైంది వెళ్ళిపోయి. ఇంకా రాలేదు," అన్నది ఆయనతల్లి.

"రాగానే నే వచ్చాన్నానని చెప్పండి," అన్నాను.

"వా డిక నీ దగ్గరికి రాడు బాబూ."

"ఏం? మంగపతికి నా మీద కోపమొచ్చిందా? అస లేం జరిగిందమ్మా!"

"ఏమోబాబూ! నీ ముఖం చూస్తేనే పాప మంటాడు," అని ఊరుకుంది.

నామనస్సుకు చాలా బాధనిపించింది. నా ముఖం చూడరానంత పావం నే నేం చేశాను? అతడికి నామీద కోపం ఎందుకు కలిగిందో? ఇంకా ఏ వేవో ఆలోచనలతో మధనపడుతూ గదిలోకొచ్చి పడ్డాను.

కాసేపటికి మున్నా వచ్చింది "కూర్చో"మని కుర్చీచూపించాను. ఆమె కూర్చోలేదు. ఎప్పటిలాగే తలుపుకొరిగి నిల్చున్నది.

"స్కూలు కెళ్ళకుండా ఆపడంలో మీ ఉద్దేశ మేమిటి?" అని అడిగాను.

"మీ కొచ్చింది మామూలు జ్వరం కాదు తగ్గిందికదా అని బయట తిరుగుతే ప్రమాదం. ఇంకొక రెండు రోజుల వరకు విశ్రాంతి అవసరం," అని చెప్పింది.

"మీరు డాక్టర్ చదువుతే బాగుండే



దేమో," అన్నాను నవ్వుతూ. ఆమె నవ్వి వూరుకున్నది. వెళ్ళిపోతుం దనుకున్నాను

కాని అలా జరగలేదు. రెండు నిముషాల పాటు గది నిశ్శబ్దంగావుంది. నేను

ఉండబట్టలేక అడిగాను — "ఏదైనా పనుండి వచ్చారా" అని.

గాసు " అన్నగి గెలకేసిగాస్తూ

చిన్నగా నవ్వుతూ మంగపతిని రమ్మంటారా?'' అని అడిగాను.

''ఎందుకూ?''

''మీ కాయన స్నేహితుడు కదా! అందుకు.''

''మీలాంటి అమాయకులు తప్ప అలాంటి పశువుల్తో ఎవరు స్నేస్తం చేస్తారు?" అన్నది కఠినంగా.

నా కమితాశ్చర్యం వేసింది. "ఏమిటంటున్నారు?" అన్నాను.

"ఆయన శరీరంలాగే ఆయన మనసు కూడా ఒక కఠినశిల. ఆడదంటే ఆయన ఉద్దేశ మేమిటో నేను వివరించలేను. ఆయన ప్రతిరోజూ చేసే గలాటాకు పాడే ప్రేమగీతాలకూ అంతూ పంతూ లేదు. నా కాయనంటేనే ఒళ్ళుమంట."

"ఐతే మంగపతి అంటే మీకు ద్వేషమా?"

"ద్వేషం కాక పోయినా పరమ అసహ్యం. రోజుకు పదిసార్లయినా నా చేతినుంచి నీళ్ల త్రాగేవాడు; అందించలేక చచ్చేదాన్ని. మా అమ్మ చాటైనప్పుడల్లా 'మున్నా! మంచినీళ్ళు' అని కేకేశేవాడు ఛీ, ఆ పశువును గురించి ఆలోచించడమే నేరం." అని ఊరుకున్నది మున్నా

నా కంతా అర్థమైంది నేననుకొన్నట్లుగా మంగపతి మోసపోయాడు. ఏదో అఘాయిత్యం చేయబోతే మంచిబుద్ధి చెప్పిపంపించింది మున్నా

'విసింది. మి ం చ్చుల ఎనేమిటి చెప్పారుకాదు."

"అబ్బే ఏంలేదు." అంటూ బిరబిరా వెళ్ళిపోయింది

ఆ రోజంతా ఫ్రెండ్సుకు, బంధువులకు ఉత్తరాలు వ్రాస్తూ గడిపాను సాయంత్రం ఆరుగంటలవేళకు మున్నా తల్లి నా గదికి వచ్చింది. "హోటలుకెళ్ళకు బాబూ? భోజనం తయారైంది." అని చెప్పి వెళ్ళిపోయింది.

నేను డబ్బిచ్చినందుకుగాను ఆమె చేసే సత్కారం ఇది. ఎనిమిదిగంటలకు మున్నా వచ్చి భోజనానికి తీసుకెళ్ళింది.

వాళ్ళ వంటఇల్లు ఎంత చిన్నదైనా ఎంతోఅందంగా కనిపిస్తూంది అమర్పులోని నేర్పు నాకు చాలా నచ్చింది, నిశ్శబ్దంగా కూర్చున్నాను.

''బాబూ! మీరు బ్రాహ్మలు. కనుకనే ఇంట్లోకి రానిచ్చాను. ఇంకొకరైతే గడప తొక్కనీయను మాకు బ్రాహ్మడంటే చాలాభక్తి,'' అని చెప్పుకుంది వాళ్ళ అమ్మ.

సయించినంతవరకు తినివచ్చి గదిలో పడ్డాను. తొందరగానే నిద్రపట్టింది.

ఉదయం ఎనిమిదిన్నరకి మెలకువ వచ్చింది బడివేళ దాటినందుకు విచారం కలిగింది మధ్యాహ్నం పోతే సరి అని ఊరుకున్నాను

స్నానం అదీ అరగంటలో ముగించి స్వామికి అగరువత్తులు వెలిగించాను. నాకు సరియైన ఆరోగ్యం ప్రసాదించిన స్వామి చరణాలకు హృదయాంజలి అర్పించాను చివరసారిగా నమస్కరించి వెనుదిరిగాను

తలవంచి, కళ్ళుమూసుకొని అంజలి ఘటించిన మున్నామూర్తి కనిపించింది. ఏ మహాశిల్పి మలచిన దివ్యసుందర విగ్రహమో అనిపించింది.

ఆమె కళ్ళు విప్పింది. నా చూపులు ఆమెపైనుంచి మరలిపోయినయి.

"మీరు చాలా మంచివారండీ,'' అన్నది మున్నా.

ఎందుకో ఏమో అర్థమవలేదు. ఎందుకూ అని నే నడగలేదు.

"మీరు ప్రతిరోజూ శ్లోకాలు చదువుతారు. ఈ వేళ మానేశారేం?'' అని అడిగింది.

"మనసులో చదువుకున్నాను.''

"నాకు మీ నోట జారే ప్రతి పదం వినా లనిపిస్తుంది,'' అన్నది.

"ఉహుం!'' అన్నాను మున్నా మాటలతీరు నాలో సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తూనేవున్నాయి.

"మీ రేమీ అనుకోనిపక్షంలో ఒక పాట పాడండి,'' అని అడిగింది

"తప్పదా?" అన్నాను.

"ఉహూం!'

నాకు వచ్చిన పాటేదో పాడేశాను. అర్థముకుళిత నేత్రాలతో తన్మయంగా విన్నది మున్నా.

"మీరు పాడుతుంటే నన్ను నేనే మరచిపోతానండి'' అన్నది. ఆమెలో పొంగే ఆనందావేశాలు నాలో తెలియని భయాన్ని కలిగించాయి.

"మీ ధోరణి నా కేం అర్థం కావడం లేదు,'' అన్నాను.

"మగవాడిలోవున్న లోపమే అది," అని బిరబిరా వెళ్ళిపోయింది. అప్పటికి మున్నా ఆంతర్యం యేమిటో నా కర్థమైంది. ఐనా ఈవిడ విడమర్చి చెప్పక చిక్కులో పెట్టిందే అనిపించింది. ఇన్ని రోజులుగా ఏ భావనా లేకుండా నిర్మలంగా వున్న నా మనసులో ఏదో భావం ప్రవేశించి గిలిగింతలు పెట్టింది. నేను పొరపడుతున్నానా? నేను చేసేది నేరమా? ఆమెను, ఆమె మాటలను తప్పుగా అర్థం చేసుకున్నానా? నాలో కాసేపు ఆత్మ విమర్శ జరిగింది నేనే గెలిచాను. మున్నా నాదే అన్న భావం నాలో దృఢపడింది. ఆమె పలికిన పలుకులు చెవుల్లో ప్రతిధ్వనిస్తుంటే ఆమె తియ్యని సాన్నిహిత్యపు టనుభూతులు నన్ను పరవశుడిని చేశాయి. నన్ను నేనే మరచిపోయాను. ఆనాడు నా ఆనందానికి అవధులే లేవు మున్నా లాంటి విశాలహృదయం గల మనిషి నాకు ప్రపంచమంతా గాలించినా దొరుకుతుందా ఆమె సుందర వదనంలోని

నిర్మలత చంద్రుడిలో గూడా కనిపిస్తుందా? అసాధ్యం... అనాదంతా నేను అత్యాశ్చర్యానందం అనుభవించాను.

మళ్ళీ తెల్లవారాలి. ఎప్పుడు తెల్లవారాలి! మున్నా రావాలి; ఆమె హృదయంపై వాలిపోవాలి. నన్ను బ్రతికించిన మున్నా సహృదయంలో పూర్తిగా నిండిపోవాలి. నాకు నిముషం యుగంగా తోచింది. అతి కష్టంగా ఆ రాత్రి కరగిపోయింది.

పాలు తీసుకొని మున్నా తల్లి వెళ్ళిపోయింది. ఇక మున్నా వస్తుంది. నాలో ఉత్సాహం పొంగిపోయింది. మున్నా రావడానికి ఎక్కువకాలం పట్టలేదు. విశ్వబ్ధంగా వచ్చి తన స్థానంలో నిలబడింది.

మళ్ళీ అదేస్థలం. అలాగే తలపైనున్న పైట. అదే అంగకవళిక. నిజంగా మున్నా సౌందర్యరాసి. ఆనాడు నాకు తెలియకుండానే ఆమెను కలయజూశాను. అప్రయత్నంగానే ...... "మున్నా" అని పిలిచాను.

మున్నా "ఊఁ," అంది.

"నా పొరపాటు నా కర్థమైంది మున్నా," అన్నాను.

"ఐతే నా బ్రతుకు ధన్యమైంది," అన్నది.

అది నా బ్రతుకుచరిత్రలో చెదిరిపోని సంఘటన. ఆరోజునే మున్నా విశాల నేత్రాలలో నన్ను చూసుకున్నాను. ఆనంద పులకితయై ఆమె రాల్చిన బాష్పాలు బుగ్గలపై జారుతూంటే నా హస్తాలతో తుడిచివేశాను. అనాడే నాకు మున్నా చల్లని హృదయంలో సంపూర్ణ స్థానం లభించింది. ఆమె వెచ్చని స్పర్శలోని ఆనందం అనాడే కలిగింది.

ఆనాడు నేను పరవశించి పాడాను. మున్నా మైమరచి ఆడింది. నాకు ఆశ్చర్యమేసింది. మున్నా సంస్కారవతియే గాక కళావతి. నా భాగ్యానికి గర్వపడ్డాను.

నా కెందుకో తీవ్రంగా దగ్గుపోట వచ్చింది. దగ్గుతూ పడకపై కూలబడ్డాను. మున్నా ఆత్రంగా నన్ను చేరింది. గొంతుపై స్పర్శించింది. గ్లాసెడు నీళ్ళు త్రాగించింది. మున్నా నా పడకపక్క నిలబడివుంది. చేయిబట్టి కూచోబెట్టాను. హఠాత్తుగా నామీద వాలింది. నన్ను మ్రింగేలా చూసింది.

"ఏమిటి మున్నా! అలా చూస్తున్నావ్?" అన్నాను

"నన్ను నేను చూసుకుంటున్నాను," అన్నది.

నాకు మున్నా భావం అర్థమైంది. ఏమీ మాట్లాడకుండా వూరుకున్నాను. ఇంకా ఆమె చూపులు నాపైనుంచి మరల్చలేదు, నాకే సిగ్గనిపించింది. నేను కిటికీలోగుండా మల్లెపందిరిపైకి దృష్టి మళ్ళించాను. మున్నా నాగడ్డంపట్టి నాముఖాన్ని తనవైపు త్రిప్పుకుంది.

"ఏమిటి మున్నా!" అని అడిగాను.

"నా నోరు మూగవోయింది. నాకళ్ళతో చెబుతా వినండి." అన్నది.

"నా కాళశక్తి లేదేమో!" అన్నాను

నవ్వితీరుతున్నది మున్నాతో ఏవేవో మాట్లాడాలని మనసు ఆత్రపడుతున్నది. కాని యేమీ మాట్లాడలేకపోతున్నాను. కొద్దిసేపట్లో మున్నా పలకరించింది...

"ఏమండీ! నాకు మీలో స్థానం వుందా? నిజంగా చెప్పండి," అని.

"మున్నా! పరిహాస మాడుతున్నావా? నా సర్వస్వాన్నీ దోచి పైగా వాలో చోటుందా అని అడుగుతావేం—" అన్నాను.

మున్నా పరవశించిపోయింది ప్రేమామృతపరిష్వంగనంలో నన్ను పరవశింప చేసింది ఒక అరక్షణం అలాగే ఉండిపోయాం.

బయట యెవరో తలుపు తట్టారు. మున్నా భయంగా వెళ్ళిపోయింది. నేను చూస్తూవుండిపోయాను.

"మున్నా!" అని బయటినుంచి కేక వినిపించింది. ఆ కంఠం మున్నా తల్లిది మున్నా తలుపు తీసింది. వాళ్ళు లోనికి వెళ్ళిపోయారు. నామనసు కుదుటపడింది.

ఆనాడు నాకు బడిపై రోతకల్గింది. ఇంట్లోంచి బయటకైనా పోలేదు. కాలం వేగంగా ఎదుస్తున్నట్టు తోచేది. ఆ నెలంతా నేను శిక్షణాలయానికి పోలేదు. నాకు స్టయిఫండ్ రాదని తెలుసు. డబ్బు కోసం నాన్నకు ఉత్తరం వ్రాశాను. డబ్బు వస్తుందని నాకు తెలుసు. నేను శిక్షణాలయాన్ని మాని మున్నాతో కాలం



గడపడం భవిష్యజ్జీవనానికి పునాదియని మునినాకు తెలుసు కాని నేనామెను విడిచి ఉండలేకపోయాను. మున్నా ప్రతిరోజూ స్కూలుకెళ్ళమని పోరుపెట్టేది. స్కూలు పేరుతో ఒకగంట పార్కులో తిరిగి గది చేరేవాడిని. మున్నా నన్ను గాఢంగా విశ్వ సిస్తోంది. నేను చెప్పిందల్లా నిజమను కుంటోంది. కనుక నన్నవమానించలేదు ఆ నెలరోజులలో మా మధ్యన పెరిగిన ప్రేమ అనిర్వచనీయం మమతా అను రాగాలకు ప్రతిరూపాలుగా పూవుకు తావిలాగా మెదులుతూన్నాం

ఆనాడు శనివారం. నాన్న పంపిన యం. వో. అందింది. ఆ రోజు నాకు ఘాతవరం, కనుక ఉదయాన్నే దేవుడికి కొబ్బరికాయ కొట్టాను. దేవుడిప్రసాదం మున్నాకొరకు దాచివుంచాను. ఎనిమిది గంటల వేళకి మున్నా వచ్చింది దయా మయుడైన స్వామికి నమస్కరించి ప్రసాదం స్వీకరించింది ఒకరి ప్రక్క ఒకరం నిలచి స్వామికి నమస్కరించాం. దేవుడు మమ్మల్ని దీవించినా దను కున్నాం......

మున్నా రోజూలాగా నా ప్రక్కన కూర్చున్నది. తీయని కబుర్లేవో చెబు తూంది. నా మన సానాడు నాన్నవైపు మరలింది. ఆయన దొక విషాద జీవితం. ఆయనకు డబ్బుకొరకు ఉత్తరం వ్రాసి నందుకు నా మన సెంతగానో మధన పడింది.

'మున్నాకు విముగని పించిందో ఏమో!. "ఏమండీ, ఈవేళ పరధ్యా నంగా వున్నారేం?" అని అడిగింది

మున్నా ముందు దాపరిక మేముంది? అంతా చెప్పాను పడకమీదినుండి లేచి కిటికీ దగ్గర నిల్చున్నాను. మల్లెపందిరికి ఇవ్వాళ ఒక్కపువ్వైనాలేదు. బహూశా మున్నా తెంపుకొని ఉంటుందను కొన్నాను. నాన్న తలపులు మనసునుంచి మరల్చాలని యత్నించాను. కాని నాకు సాధ్యంకాలేదు. ఆయన మూర్తి నా కళ్ళ ముందు దీనంగా కదలిన ట్లన్పించింది నా కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

మున్నా నా భుజంమీద చేయివేసి నన్ను తనవైపు మరల్చుకుంది. నా కన్నీళ్ళు ఆమె కంట పడకూడ దను కున్నాను. కాని తప్పలేదు.

"మీరు ఎందుకో తీవ్రంగా బాధపడు తున్నారు. నా ముం దేమో దాస్తున్నారు. చెప్పండి, నిజం చెప్పండి," అన్నది మున్నా.

"మున్నా· మా నాన్న అసౌఖ్య జీవనం, ఆయన దైన్యం తలపుకు వచ్చింది. అందుకే కన్నీళ్ళువచ్చాయి," అన్నాను.

"మున్నా!" పెద్ద పిడుగుపాటులా ఎవరో అరిచారు.

ఇద్దర మదరి కిటికీలోంచి చూశాం. మున్నా తల్లి అగ్నినేత్రాలతో మమల్ని చూస్తూంది. నాకు ముచ్చెమట్లు పోశాయి.

మున్నా గబగబ నడుస్తూ గది దాటింది. వాళ్ళు వెళ్ళిపోయారు. నే నా గదిలో ఉండలేకపోయాను. తొందరగా బయట పడ్డాను. ప్రతిరోజూ పదకొండుగంటలకు వచ్చే మున్నాతల్లి ఈ వేళ ఇరవై నిమిషాల్లో తిరిగివచ్చింది ' విధి మూసై కసి చూపు చూసింది ఇక నేనా గదిలో ఉండలేను. మున్నా నా కళ్ళకు కనిపించదు. అసలు మున్నా లేకుండా నేను బ్రతకడమే అసంభవం.

పిచ్చివాడిలాగా టౌనంతా తిరిగాను. సాయంత్రంవేళ పార్కుకి చేరాను. ఏవేవో ఆలోచనలు మనసును కలవర పెడుతూ వుంటే ఓర్చలేకపోయాను. బాధగా తోచింది. సిగరెట్టుపెట్టె తెచ్చుకొన్నాను. తొమ్మిదిగంటలవరకు పార్కులోనే గడిపి భయం భయంగా యింటిదారిపట్టాను.

తలుపులు తీసేవున్నాయి. మెల్లిగా పిల్లిలా గదిలో దూరి తలుపులు దగ్గరగ వేశాను. పడకపైబడి రగ్గు తన్ని పండుకున్నాను. ఎంత కళ్ళు మూసుకున్నా నిద్రరాలేదు. కాలం బరువుగా నడుస్తూంది. వున్నకొద్దీ సిగరెట్లు అయిపోయాయి. పిచ్చిలేచినట్లుగా అనిపించింది. టౌను పోలీస్టేషన్‌లో 12 గంటలు కొట్టారు. నా కళ్ళు మండుతున్నాయి. ఆకలి దహించి వేస్తూంది. చాలా నీరసంగా వుంది.

పది నిమిషాలు గడిచాయి. ఎవరో నా తలుపు తోసుకొని లోపలి కొచ్చారు. నాకు మున్నావాళ్ళు నన్నేమో అని భయం వేసింది. కాని. ఒక్క క్షణంలో. వచ్చింది మున్నాయే అని గమనించాను. నా భయాశ్చర్యాలకు అంతులేదు.

"మున్నా." అన్నాను మెల్లిగా

"ఉష్," అన్నది.

ఇక నే నేమీ మాట్లాడ లేదు. నా చెయ్యి పుచ్చుకొని మెయిన్‌గేటు దాటించింది. రోడ్‌పైకి తీసుకొచ్చింది.

"ఏమి టిది మున్నా! ఈ అర్ధరాత్రి వేళ ఎంత సాహసించావ్. మీ అమ్మ చూస్తే ఇంకేమైనా వుందా," అన్నాను,

"ఏం ఫరవా లేదు. మీకు చెప్పాల్సింది చాలావుంది. అందుకే వచ్చాను," అంది —

"ఏమి టదీ?" అన్నాను.

"తెల్లవారకుండానే మీరువెళ్ళిపోండి; లేకుంటే మీకు చాలా ప్రమాదం జరుగుతుంది. ఈ పాపిష్ఠిదాని మూలంగా మీకు యే బాధా కలుగరాదు. తప్పకుండా వెళ్ళిపోండి," అని ఇంటిదారి పట్టింది.

"మున్నా!" నేను గట్టిగా అరిచాను.

వెనుదిరిగి చూసింది.

"మున్నా! న న్నెంతో నిష్కర్షగా వెళ్ళమంటున్నావు! నిన్ను విడచి బ్రతకడం నా కెంత కష్టమో నీకుతెలియదా? నా కే ప్రమాదం జరిగినా ఎదిరిస్తాను. మనిద్దరికీ అంగీకారమైన తరవాత యే శాస్త్రమూ అడ్డగించలేదు," అన్నాను.

"మీ పాదాలు పట్టుకుంటాను; మీరు

వెళ్ళిపోండి. లేకుంటే రేపు ఉదయమే మిమ్మల్ని గురుపీఠానికి తీసుకుపోతారు. మీ నేరానికి ఏదో శిక్ష విధిస్తారు," అని వెక్కివెక్కి ఏడ్చింది మున్నా.

"మున్నా! మనం చేసింది నేరం కాదు అది మనం పెద్ద మనుష్యుల మధ్యన ఒప్పించలేమా?" అన్నాను ఆవేశంగా.

"మీరు అమాయకులు. నన్ను ఇంట్లో బంధించిగాని మిమ్మల్ని గురుపీఠానికి తీసుకుపోరు. మీకు నే నెక్కువగా వివరించలేను. మీరు తప్పకుండా వెళ్ళిపోండి."

"పోలేను మున్నా! నీకు దూరమైపోందే బాధకన్నా, రేపు నాకు విధించే శిక్ష హాయిగా వుంటుంది" అన్నాను.

హఠాత్తుగా మున్నా నా కాళ్ళమీద పడింది. ఆమె కన్నీళ్ళు నా పాదాల మీద రాల్తున్నాయి. నాకు భరించరాని దుఃఖం వచ్చింది. మున్నాను లేవనెత్తాను. మున్నా నా ముఖంకేసి చూసింది. ఒకనాడు ఆనందబాష్పాలతో నిండిన నయనాలు ఇప్పుడు బాధాశ్రువుల్ని వర్షిస్తున్నాయి.

మున్నా మొదలు పెట్టింది: "మీరు పసివాడిలా పట్టుపట్టక వెళ్ళిపోండి. మీ విచక్షణాజ్ఞానం యేమైంది. మా ఇంట్లో మీ కింకా స్థానం వుందని యెందు కనుకుంటున్నారు," అని అడిగింది.

నా గుండెల్లో బండలు వర్షించినట్లు తోచింది. పొంగే దుఃఖం కళ్ళని పగలగొట్టి బయటపడుతుందేమో ననిపించింది. దుఃఖం దిగమ్రింగుతూ "నీ ఒడిలోనే ప్రాణా లొదలాలని కోరికగా వుంది మున్నా." అన్నాను.

మున్నా నాపై వ్రాలి భోరున ఏడుస్తూ అన్నది— "మీరు వెళ్ళిపోని పక్షంలో — కొన్నిగంటల్లో నా శవాన్ని చూడక తప్పదు," అని.

"మున్నా!" అని గట్టిగా అరిచాను. నాలో ఏదో బలవంతమైన ఆవేదన ఆవేశంతో మిళితమై బయటపడింది నా ధ్వని వీధిలో ప్రతిధ్వనించింది. మున్నా ఏడుస్తూ లోని కురికింది. "మున్నా!" అని మళ్ళీ అరిచాను. ద్వారం మూస్తున్న మున్నా చేతులెత్తి నమస్కరించింది. ఒకేసారి కరెంటుదీపాలు ఆరిపోయాయి. మున్నా ముఖం నా కనిపించలేదు — దుఃఖాన్ని నిగ్రహించుకోలేకపోయాను. నోటినుంచి గద్గదస్వరం — కళ్ళనుండి అనంత అశ్రుధార —

ఆ చీకటిలో — చుక్కల గుడ్డివెలుగులో నాదొక మహాప్రయాణం...

